కథ

# ఇచ్చిన మాట

డా. తంగిరాల మీరసుబ్రహ్మణ్యం



"నాకు నిన్ను చూడాలని వుంది. ఎప్పుడొస్తావు?" ఫోను తీయగానే అడిగింది పెద్దక్క.

నా గుండె దడదడ కొట్టుకుంది. ఎందుకో గాభరాగా అనిపించింది. 'ఏమైంది? ఎందుకిలా హఠాత్తుగా చూడాలని వుంది.. ఎప్పుడొస్తావు అనడుగుతూంది?' మనసులో ప్రశ్నలు.

"నీ ఆరోగ్యం ఎలా వుందక్కా?" సాధ్యమైనంత వరకు మామూలుగా ధ్వనించాలని ప్రయత్నించాను.

"నాకేం? గుండ్రాయిలా వున్నాను" అంది ధీమాగా. అదే జవాబు పదిహేను సంవత్సరాలుగా చెబుతోంది. ఆమె ఆత్మ స్థైర్యానికి ఆశ్చర్యమనిపిస్తుంది. కాస్త జలుబు చేసి, తలనొప్పి, జ్వరం వస్తేనే మిన్ను విరిగి మీద పడినట్టు హడావుడి చేస్తాను నేను. కానీ తను మాత్రం తొణకదు.

"నువ్వేలా వున్నావు? నడుము నొప్పి తగ్గిందా?" తనే అడిగింది.

'అయ్యో రామ! కాస్త వంగి లేచీ పనిచేసానంటే ఎక్కడ లేని నొప్పీ చంపేస్తుంది' అనబోయి బలవంతంగా నియంత్రించుకున్నాను. 'తగ్గిందిలే.. రేపు శివరాత్రి కదా... ఉపవాసం... పూజ.. ఆయన సంగతి తెలుసుగా... పండగకాగానే బయల్దేరి వస్తాను" అన్నాను.

"నువ్వు రాకపోతే నేనే వస్తాను. నాకు నిన్ను చూడాలని వుంది" అంది మళ్ళీ.

ఆ మాటల్లో ఎంత పట్టుదల? తనకి నడుము చుట్టూ ఎనిమిది అంగుళాల బెల్టు వేసారు. అడుగు తీసి అడుగు వేయడానికి కష్ట పడుతుంది. నేను అక్కను చూసి మూడు నెలలయిపోయింది. నాకూ చూడాలని మనసు పీకుతూనే వుంది. ఎప్పటికప్పుడు ఏవో అడ్డంకులు. ప్రయాణం కుదరలేదు. గట్టిగా అయిదు గంటలు ప్రయాణం కూడా లేదు. ఆవలి ఎల్లుండి ఆరు నూరైనా వెళ్ళి చూసి రావాలి. ఈ మధ్యన కాస్త పరాకు. మతిమరపు ఎక్కువగా వుందని అక్క కూతురు చెప్పింది. అప్పుడే భోజనం చేసి వచ్చినా 'అన్నం తిన్నావా?' అనడిగితే 'ఇంకా లేదు' అంటుందిట. ఇప్పుడెలా వుందో' అనుకున్నాను.

"అక్కా మొన్న ఒక పాట వింటుంటే రాగం గుర్తుకు రాలేదు. అదే... మల్లీశ్వరి సినిమాలో 'పిలచినా బిగువటురా' మన కిష్టం కదూ?" అన్నాను.

"బిళహరి కదా!" అంటూ ఆరోపణ అవరోహణ వినిపించింది ఫోనులోనే.

"హమ్మయ్య... ఫరవాలేదు. గొంతు గంటకొట్టినట్టు వినిపించినట్టే మెదడు పదునుగా పని చేస్తోంది ఇంకా... ఆ మరపు అవీ అప్పుడప్పుడు వస్తాయేమో.

సంగీతం తనకు ప్రాణం. వీణ చేతబట్టితే అపర సరస్వతిలా వాయించగలదు. నాన్నగారి కెంత గర్వమో కూతురి విద్వత్తు చూసి. నాన్నగారు వున్నప్పుడు అక్క పుట్టింటికి వచ్చిందంటే మేమూ వెళ్ళాల్సిందే. ఎందుకంటే తనే మాకు తల్లి. అమ్మపోయాక మా చదువులు పెళ్ళిళ్ళు అన్నీ తన చేతి మీదే జరిపించింది.

రాత్రి భోజనాలయ్యాక తొమ్మిదింటికి "ఏమ్మా ఇక వీణ పట్టుకుంటావా?" అనే వారు నాన్న గారు. హంసధ్వని రాగంలో 'వాతాపి గణపతిం భజే'తో మొదలు పెట్టి నాన్నగారి కిష్టమైన కీర్తనలన్నీ వాయించేది. కదన కుతూహల రాగంలో 'రఘు వంశ సుదాంభుది చంద్ర' కీర్తన వాయించేటప్పుడు చిట్టిబాబు వీణ మీద చేసే చిత్ర విచిత్రమైన సాములన్నీ తనూ యథాతథంగా పలికించేది. ఆఖర్న 'కొమ్మలో కోయిలా 'కూ' అన్నదే' అన్న లలితగీతం ఆ 'కూ' అన్న కోయిల స్వరం వినగానే ఎంత సంతోషమనిపించేదో....

"ఏమిటాలోచిస్తున్నావు? చెప్పాను కదా నువ్వు రాకపోతే నేనే వచ్చి నిన్ను చూసి వెళ్తాను. గుర్తుం

చుకో'' మళ్ళీ హెచ్చరించింది.

''చెప్పానుగా... రేపు శివరాత్రి గడవనీ... నీ అంత నిష్టగా కాకపోయినా ఏదో ఉపవాసం, పూజ వుంటాయిగా' అనేసిన వెంటనే మనసు చివుక్కు మంది. తన ప్రస్తుత పరిస్థితి తెలిసీ ఎలా నోరు జారాను. పాపం ఎంత మనసు నొచ్చుకుందో.. నిజమే... ఇన్నేళ్ళుగా తన అలవాటైన శివపూజ ఈ మధ్యన మానేసింది. వాళ్ళ పూర్వీకులు తమ ఇంటి దగ్గరే కట్టిన శివాలయంలో ఉదయం సాయంత్రం పూజ చేయనిదే రోజు గడవదు తనకు. శరీరంలోని రుగ్మత మెల్లిమెల్లిగా ఈ పదిహేనేళ్ళలో తన శక్తి నంతా హరించగా ప్రస్తుతం తనంత తానుగా నడ వలేని పరిస్థితికి వచ్చింది. తన అసహాయ స్థితిని గురించి గుర్తు చేసిన నా మాటలకు ఎంత నొచ్చు కుందో? నా మనసు తల్లడిల్లింది.

ఫోనులో అక్కగొంతు కమ్మగా వినిపించింది. ''నా నిష్ట, నా పూజ ప్రస్తుతం ఇలా సాగుతోంది. రేపు శివరాత్రికి అంతే'' అంటూ శ్లోకం పఠించింది రాగయుక్తంగా' ఆత్మాత్వం గిరిజామతిః స్సహచరాః ప్రాణాశ్శరీరం గృహం పూజాతే విషయోప భోగ రచనా – నిద్రా సమాధి స్థితిః సంచార పదయోః ప్రదక్షిణ విధిః – స్తోత్రాణి సర్వాగిరో యద్యత్కర్మ కరోమి తత్త దఖిలం – శంభో తవారాధనమ్'.

శివమానస పూజస్తోత్రమ్ లోని శ్లోకమిది. 'ఈశ్వరా నువ్వే నాలోని ఆత్మవు నాలోని బుద్ధి పార్వతి. నా పంచప్రాణాలు మీ సేవకులు. నా శరీ రమే నివాసం. ఈ దేహానికి చేసే సేవలన్నీ మీకే. నా నిద్ర సమాధి స్థితి. నా పదముల సంచారం మీకు ప్రదక్షిణలు, నా మాటలు మీకు స్తోత్రములు. నేను చేసే కర్తవ్యములన్నీ ఈశ్వరా నీ ఆరాధనలే'... అని అర్థమిచ్చే శ్లోకంలోనే తన నిస్సహాయ పరిస్థితి లోను ఈశ్వరుని మీద తన సడలని భక్తి చూపించింది.


నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి: ''ఇంతకన్న భక్తిని ఏ భగవంతుడు కోరుకుంటా డక్కా? సరే రెండు రోజుల్లో కలుస్తాము కదా! మాట్లాడుకుందాం'' అంటూ ఫోను పెట్టేశాను. అప్పుడే రాత్రి పది గంటలయింది.

శివరాత్రి రోజున ఉదయాన్నే శిరసాన్నం చేసి దేవాలయానికి వెళ్ళి శివుడిని దర్శించుకుని, ఈశ్వ రుడికి అభిషేకించిన పంచామృతం ప్రసాదం స్వీక రించి వచ్చేసాను.

శివాలయంలో వున్నంత సేపూ అక్క జ్ఞాప కాలే. ఆలయ కుడ్యాల మీద వున్న పార్వతీ పరమేశ్వరులు చిత్రాలను చూస్తుంటే మా బావగారు అక్క పుట్టింటికి వచ్చినప్పుడు ప్రతి ఉత్తరంతో బాటు ఒక బొమ్మ వేసి పంపడం గుర్తొచ్చింది. ఆయన గీసి పంపిన చిత్రాలలో అత్యంత సుందరంగా వున్నవి శివ పార్వతుల చిత్రము, రాధాకృష్ణుల చిత్రము. పార్వతి, రాధల కళ్ళు విశాలమైన అక్క కళ్ళే! ఆ బొమ్మలు చూసి అక్కను బాగా ఏడి పించే వాళ్ళం ''అమ్మో బావగారు బావురు పిల్లిలా గంభీరంగా కనబడుతారు గానీ చాలా రొమాం టిక్'' అంటూ.

ఉత్తరం వచ్చిన మర్నాడు మనీఆర్డరు వచ్చేది. వంద రూపాయలకు తక్కువ ఎప్పుడూ పంపించే వారు కాదు. మని ఆర్డరు వచ్చిన రోజున మాకు పండుగ. మా అందరికీ హోటలు నుండి మసాలా దోసెలు తెప్పించి ఇవ్వాలని గోల చేసేవాళ్ళం. ఒక మాసాలా దోశ అణన్నర... మేం అయిదుగురం అక్క చెల్లెళ్ళు, ఒక తమ్ముడు, అమ్మా, నాన్న వెరసి ఎనిమిది మందికి ఒక రూపాయి తీసుకు వెళ్ళి దోసెలు తెచ్చేవాడు నౌఖరు ముసలయ్య. పేరు ముసలయ్యే గానీ వాడు పడుచువాడే.

''అమ్మాయి గారూ! మిగిలిన నాలుగణాలు నాకు సినిమా డబ్బులాండీ?'' అంటూ నైస్‌గా లాగేసే వాడు. నేల టికెట్టు నాలుగణాలు. ఎప్పుడూ రూపాయి టిక్కెట్టు బాల్కనీలో కూర్చుని సినిమా చూసిన దాన్ని ఒకసారి స్నేహితురాళ్ళతో 'మాయాబజారు' సినిమా నేల టికెట్టుకు వెళ్ళి చూసాను. బొమ్మలు మీదకు వచ్చేస్తుంటే భయపడి కళ్ళు మూసుకోవడం గుర్తే. జ్ఞాపకాల నుండి తేరు కుని ఇంటికి వచ్చి పూజ ముగించాక ఫలహారం కానిచ్చాను. శివరాత్రి నాడు రాత్రి లింగోద్భవ సమ యంలో అర్చన అభిషేకం చేయడం మావారి అల వాటు. మధ్యాహ్నం నిద్ర పోకూడదని టి.వి. ముందు కూర్చున్నాను.



పాత సినిమా 'కులగోత్రాలు' వేస్తున్నారు. అమ్మతో కలిసి చూసిన సినిమా అది. నాన్నగారు తాసిల్దారు గనుక మాకు సినిమా టికెట్టు కొననిచ్చే వారు కారు హాలు వాళ్ళు. వాళ్ళకు నష్టం రాకూడదని సగం హాలు కాళీగా వుండే రోజుల వరకు మమ్మల్ని సినిమాకు వెళ్ళనిచ్చే వారు కాదు నాన్నగారు. ఆ సినిమాకు వెళ్ళినప్పుడు అక్క గర్భిణి. పురిటికి పుట్టింటికి వచ్చింది. మ్యాటనీ సినిమాకు వెళ్ళి వచ్చాము. ఆ రోజు నాకు అంతగా గుర్తుండి పోవడానికి కారణం ఆ సాయంత్రం జరిగిన ఒక విచిత్రమైన సంఘటన.

సాయంత్రం ఆరు గంటలప్పుడు అమ్మ, పెద్దక్క, చిన్నక్క, నేను అందరం వరండాలో చీడీల మీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాము.

అప్పుడొచ్చాడు ఒక కోయదొర. ఎవరో పిలిచినట్టు నేరుగా గేటు తీసుకుని లోపలికి వచ్చేసాడు.

మా అక్కను చూసి సుఖప్రసవ మవుతుందనీ మగబిడ్డ పుడతాడనీ, ఏడు కొండల వాడి పేరు పెట్టుకోమని చెప్పాడు. అమ్మను చూసి స్వంత ఇల్లు కొనాలని కలవరిస్తున్నదనీ కానీ స్వంత ఇంటిలో వుండే యోగం లేదనీ, ముత్తైదువుగా కళ్ళు మూస్తావనీ చెప్పాడు. చిన్నక్కను రాజుల కోటలున్న వూళ్ళో వుంటుందని చెప్పాడు. నేనప్పుడు పి.యు.సి. అయ్యాక రేడియో ఇంజనీరింగ్‌లో పాలిటెక్నిక్ కాలేజీలో చేర్పిస్తే లెక్కలు రావని మానేసి ఇంట్లో కూర్చున్నాను. నన్ను చూసి ఇన్ని చదువులు చదువుతానని తన వెంట్రుకలు పట్టుకుని చూపించి సొంత సంపాదనతో కారుకొంటానని చెప్పాడు. జ్యోతిష్కులకు సరస్వతీదేవి ఇచ్చిన శాపం మాట ఏమో గానీ కొండదొరకు మాత్రం ఆవిడ శాపం సోకినట్టు లేదు.

అక్కకు అతను చెప్పినట్టే అబ్బాయి పుట్టాడు. అమ్మ స్వంత ఇంటి కల నిజం కాక పూర్వమే ఆర్నెల్లల్లో ముత్తైదువగా వెళ్ళిపోయింది. చిన్నఅక్క పెళ్ళవ్వగానే రాజ ప్రసాదాలకు పేరెన్నికగన్న జయపూర్‌లో (రాజస్థాన్) స్థిరపడింది. నేను పై చదువులు చదివి మంచి ఉద్యోగంలో స్థిరపడి కారుకొన్నాను నా సంపాదనతో!

మరీ దూరంగా వుండే భవిష్యత్ గురించి ఎందుకు చెప్పాలనుకున్నాడో ఏమో ఆ కొండదొర మా పెద్దక్క యాభై మూడో ఏట కాన్సరు వ్యాధి బారిన పడుతుందని చెప్పలేదు. అప్పట్లో ఆ వ్యాధి పేరు ఎవరికీ తెలియదేమో కూడ.

అక్కకిప్పుడు అరవై ఎనిమిదేళ్ళు. పది హేనేళ్ళుగా కేవలం మానసికబలంతో వ్యాధిని ఎదుర్కొంటున్న దనిపిస్తుంది. ఆపరేషను చేసి రొమ్ము తొలగించినప్పుడు గానీ, కీమోథెరపీ వలన తిండి తినలేక వాంతులవు తున్నప్పుడు గానీ ఎప్పుడు తన శరీర బాధల గురించి మాట్లాడ లేదు.

మా గురించి మా రోజు వారీ చిన్న చిన్న కష్టాల గురించి అడిగి ధైర్యం చెప్పేది.

అక్క అందమంతా విశాలమైన కళ్ళలో ఒత్తైన జుత్తులోవుండేది. ఆ రెండూ ఈ వ్యాధి క్రమంగా హరించేసినప్పుడు 'దేవుడు మనకి ఈ శరీరం మీద మమకారం నశింపచేయడానికే మనకిష్టమైన వాటిని తీసేసుకుంటాడు' అన్నదే గానీ విచా రించలేదు. ఇప్పుడు కొన్నాళ్ళుగా నడవడం కూడా కష్టమై పోయినా ఆమెలో ఆత్మ స్థైర్యం, ఆత్మవిశ్వాసం ఇంచుకైనా చెదరలేదు. ఎంత ధీమాగా చెప్పింది నేను గనుక తనను చూడడానికి రాకపోతే తనే వచ్చి నన్ను చూసి వెడతానని! 'కులగోత్రాలు' సినిమా మాట ఏమో గానీ నా మనసు మాత్రం ఎన్నో ఏళ్ళు వెనక్కి వెళ్ళిపోయి ఆరోజుల అనుభవాలను అనుభూతులను నెమరు వేసుకుని తడిసి పోయింది.

పని మనిషి రావడంతో టి.వి. కట్టేసి లేచాను. వంట చేయలేదు గనుక అంట్లు గిన్నెలు లేవు. గదులు ఊడ్చి, బయట నీళ్ళు జల్లి ముగ్గేసి వెళ్ళిపోయిందామె.

సాయం సంధ్యా దీపం దేవుని గూట్లో వెలిగించి పెట్టి దగ్గరే వున్న శివాలయానికి మరో మారు వెళ్ళాను. ప్రదక్షిణ చేస్తుంటే ఆలయ కుడ్యం మీద పార్వతీదేవి చిత్రంలో అక్క ముఖం కనబడింది ఎందుకో.

ఇంటికి వచ్చాక ఎల్లుండి ప్రయాణానికి బట్టలు సర్దుకున్నాను. అక్క కోసమని కొని పెట్టిన గుంటూరు జరీ చీర మరచిపోకుండా పెట్టిలో పెట్టుకున్నాను.

రాత్రి పదకొండు గంటలప్పుడు మా వారు స్నానం చేసి పూజ మొదలు పెట్టారు.

నమక చమకాలతో ఏకాదశ రుద్రాభిషేకం చేసే సరికి చాలా సమయమే పడుతుంది.

నేను కాసేపు శివస్తోత్రాలు వల్లించుకుని పన్నెండు గంటలవుతుండగా నా గదిలో లైటు ఆర్పేసి పడక్కుర్చీలో వాలాను. సాధ్యమైనంత సేపు జాగరణ చేయాలని కోరిక. నిద్ర పోకూడదనే ప్రయత్నం.

లోపల పూజ గదిలో నుండి ఆయన గొంతు వినబడుతోంది.

''అగ్నా విష్ణోస్సజోషమే మా వర్ధంతు మాంగిరః

నమశ్చంచమే మయశ్చమేను కామశ్చమే

సౌమనసశ్చమే శ్రేయశ్చమే

ద్యుమ్నై ర్వాజేభిరాగతం, వాజశ్చమే, ప్రతిశ్చమే

ప్రగతిశ్చమే, ప్రతితిశ్చమే, ధావిశ్చమే, త్రపుశ్చమే

సర్వశ్చమే, శ్లోకశ్చమే, శ్రావశ్చమే, ధృతిశ్చమే జ్యోతిశ్చమే?

శ్రావ్యంగా, రాగయుక్తంగా వినబడుతున్న మంత్రాలు నా మనః శ్శరీరాలను ఎక్కడికో లోకాతీతమైన అనుభవం లోకి తీసుకువెడుతున్నాయి.

నిద్ర పట్టిందో, మెలకువగా వున్నానో తెలియని స్థితి. చీకటిగా వున్న గదిలో ఒంటరిగా వున్న నా పక్కన ఎవరో నిలబడినట్టనిపించి దిగ్గున కళ్ళు తెరిచాను.

పూజ ముగించి ఈయన వచ్చారా? అనుకుంటూ 'ఏవండీ!' అన్నాను. లోపల పూజ గదిలో నుండి ఘంటారావం వినబడింది.

గదిలో ఎవరో వున్నట్టు.... ఒళ్ళు గగుర్పొడిచింది. ఎందుకో... కళ్ళు తెరచుకుని శివ మానస పూజ స్తోత్రం మనసులోనే చెప్పుకోసాగాను.

ఒక గంట గడిచిందేమో. టెలిఫోను మోగింది. అర్ధరాత్రి ఒంటి గంటకు ఎవరు ఫోను చేస్తారు? మనసు వణికింది.

ఫోనులో అక్క కూతురు గొంతు వణుకుతోంది. ''పిన్నీ! పన్నెండుకు అయిదు నిమిషాల ముందే అమ్మ... అమ్మ మనల్ని వదలి వెళ్ళిపోయింది. వెళ్ళే ముందు నీ గురించే కలవరించింది. తనను చూడడానికి వస్తానని చెప్పావుట...''.

ఫోను నా చేతిలోంచి జారిపోయింది. శివరాత్రి ఘడియలు దాటకుండా శివుడిలో ఐక్యమయింది అక్క.

గంట క్రితం నా పక్కన చీకటిలో ఎవరో వున్నట్టనిపించడం... 'నిన్ను చూడాలని వుంది... నువ్వు రాకపోతే నేనే వచ్చి చూసి వెడతాను' అన్న అక్క అన్నమాట నిలబెట్టుకుందా?... విభ్రమ స్థితిలో కుర్చీలో కూలబడ్డాను.

*

